క్లుప్తంగా

బాడీ ఫ్రీజర్ వితరణ



బాడీ ఫ్రీజర్‌ను అందిస్తున్న మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి అనుచరులు

వేముల : మండలంలోని వేల్పుల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి బుధవారం బాడీ ఫ్రీజర్‌ను వితరణగా అందజేశారు. లింగాల రామలింగారెడ్డి తండ్రి దివంగత లింగాల గంగిరెడ్డి జ్ఞాపకార్థం రూ.లక్ష విలువ చేసే ఈ బాడీ ఫ్రీజర్ మండల కేంద్రమైన వేములలో అందుబాటులో ఉంచుతున్నారు. అవసరమైన వారు బాడీ ఫ్రీజర్‌ను సద్వినియోగం చేసుకోవచ్చునన్నారు.

ఆక్రమణల కూల్చివేత



ఆక్రమణలను కూల్చివేస్తున్న దృశ్యం

చింతకొమ్మదిన్నె : మండలంలోని మామిళ్లపల్లె గ్రామ పొలం సర్వే నెంబర్ 39లో ఇటీవల నిర్మాణం చేపట్టిన రెండు ఇళ్లను చింతకొమ్మదిన్నె రెవెన్యూ సిబ్బంది జేసీబీతో కూల్చివేయించారు. సర్వే నెంబర్ 39 రెవెన్యూ రికార్డుల మేరకు రైల్వే రిజర్వుడ్ భూమిగా నమోదైనట్లు, అందుకే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇటీవల చేపట్టిన నిర్మాణాల కూల్చివేత చేపట్టినట్లు మామిళ్లపల్లె గ్రామ రెవెన్యూ అధికారి అబ్బాస్ తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సింహాద్రిపురం : మండలంలోని కోవరంగుంటపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రామసుబ్బారెడ్డి, అంగడి నాగేంద్రలను ఉపాధ్యాయులు, రిటైర్డు హెడ్మాస్టర్లు భాస్కర్ రెడ్డి, రాజేశ్వరరెడ్డిలు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం విద్యార్థులకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు నాగేంద్ర విద్యా సామగ్రిని అందజేశారు. అలాగే నూజివీడు ట్రిపుల్‌ఐటీలో సీటు పొందిన విద్యార్థిని పి.లాస్యను బలపనూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ మురళీకృష్ణ అభినందిస్తూ రూ.5వేల నగదును ఇచ్చారు. కార్యక్రమంలో సీర్పీ సురేంద్రనాథరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ శివకుమార్, వైస్ చైర్మన్ పావని, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెడ్మాస్టర్లకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులరెడ్డి

లింగాల : స్థానిక ఎంఈఓ కార్యాలయంలో బుధవారం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెడ్మాస్టర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు శ్రీనివాసులరెడ్డి, రామకృష్ణయ్యలు మాట్లాడుతూ విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, సర్వేపల్లె రాధాకృష్ణ కిట్లను ఎలా ఉపయోగిస్తున్నారు, సమయపాలన, టెస్ట్ విద్యార్థులకు స్టడీ అవర్స్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూలో డైనింగ్ హాల్ ప్రారంభం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న పుత్తా పద్మ

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం గురుకులం విభాగంలో విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక డైనింగ్ హాల్‌ను వైవీయూ కుల సచివులు ఆచార్య పుత్తా పద్మ, ప్రధానాచార్యులు టి.శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకులంలో కామర్స్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు మధ్యాహ్నం సమయంలో భోజనం కోసం కిలోమీటర్ దూరంలోని మెస్‌కు బస్సుల్లో రావాల్సి వచ్చేదని తెలిపారు. నేటితో ఆ సమస్య పరిష్కారం అయిందన్నారు.

ఈ కార్యక్రమంలో వై.సుబ్బరాయుడు, ఎస్.రఘునాథరెడ్డి, డాక్టర్ పి.సరిత, ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు, ఆచార్య విజయ భారతి, డాక్టర్ రెడ్డయ్య, తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు లేదని.. మామిడి చెట్ల నరికి వేత

చక్రాయపేట : మామిడి చెట్లను పాతికేళ్లు కన్న బిడ్డల్లా చూసుకున్నారు. వాటికి తెగుళ్లు సోక కుండా మందులు కొడు తూ పెంచి పోషించారు. చివరకు వాటి వల్ల ప్రతి యేటా నష్టం వస్తూనే ఉండటంతో దిక్కుతోచక వాటిని నరికి వేస్తున్న సంఘటన చక్రాయపేటలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే చక్రాయపేటకు చెందిన సయ్యద్ చాంద్‌బాషా, సయ్యద్ పీరాం సాహెబ్‌లు తమ పొలంలో సుమారు 4 వందలకు పైగా మామిడి చెట్లు నాటారు. చంటి బిడ్డల్లా చూసుకొంటూ వచ్చారు. వాటి ఎదుగుదలను చూసి మురిసి పోయారు. అయినా ఫలితం దక్కక పాతికేళ్లు పెంచి నేడు వాటిని నరికి కట్టెలకు విక్రయించారు. ఇందుకు కారణం వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో పాటు కాపు సక్రమంగా రాక అరకొరగా వచ్చిన పూత పిందెలు రాలిపోయి నష్టాలకు గురి చేస్తుండటంతోనే కొట్టివేస్తున్నట్లు రైతులు కన్నీటి పర్యంతం అయ్యారు. బాలారిష్టాలు దాటి అరకొరగా నిలబడ్డ కాయలను అమ్ము కొందామంటే గిట్టు బాటు ధరలు కూడా లేవని వాపోయారు. మండీల వద్దకు కాయలు తీసుకెళితే అక్కడ కూడా వ్యాపారులు మోసాలు చేస్తున్నారన్నారు. ఇదిలా ఉంటే చెట్లను నరికి కట్టెలు అమ్మి వచ్చిన కాడికి సొమ్ము చేసుకుందామటే అద్దాలమర్రి క్రాస్ వద్ద నున్న చెక్‌పోస్ట్ వద్ద ట్రాక్టర్లను ఆపి ఒక్కొక్క దానికి రూ.1500 చొప్పున డబ్బు ఇచ్చే వరకు కదలనీయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



మామిడి చెట్లను నరికి వేసిన రైతులు



మామిడి కట్టెలను ట్రాక్టర్‌కు నింపుతున్న కూలీలు

ఖర్చులు కూడా గిట్టుబాటు కాలేదు



ఎంత ఖర్చు పెట్టినా ప్రయోజనం కనిపించలేదు. ఖర్చులు చూస్తే పెరిగి పోతున్నాయి. ఆఖరుకు ఖర్చు పెట్టిన డబ్బులు కూడా రాలేదు. వీటిని కొట్టేసి నిమ్మ చెట్లో, కూరగాయలో పెట్టు కుంటే బాగుంటుందని ఈ నిర్ణయం తీసుకుని మామిడి చెట్లను నరికేస్తున్నా.

– సయ్యద్ పీరాం సాహెబ్, చక్రాయపేట.

కట్టెలు తోలు కోవాలంటే రూ.1500 ఇవ్వాలంట



పంట దిగుబడి లేదు. నష్టాలు వస్తున్నాయని వాటిని నరికేసి కట్టెలు అమ్ముకుందామంటే కూడా మాకు అగచాట్లు తప్పలేదు. అద్దాలమర్రి చెక్ పోస్టు వద్ద ఒక ట్రాక్టర్ కట్టెలకు రూ.1500 ఇవ్వాలంట. ఎందుకంటే వెయ్యి చలానా అంటారు, మిగిలింది మామూలు అంటారు. లేదంటే ట్రాక్టరు ఇక్కడే ఆపి కడపకు వెళ్లి చలానా కట్టుకురమ్మంటు వేదిస్తున్నారు. – సయ్యద్ చాంద్‌బాషా, చక్రాయపేట.

ఘనంగా అయ్యప్ప అఖండ నామ సంకీర్తన

కడప సెవెన్‌రోడ్స్: స్వచ్ఛమైన హిందువుగా నిబద్ధతతో కూడిన ధార్మిక జీవనం కొనసాగించాలని అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్‌దేశ్‌పాండే అన్నారు. నగర శివారులోని డీఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన నీ గానమే నా ప్రాణం కార్యక్రమం బుధవారం జరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాక, కర్ణాటక నుంచి భక్తులు రావడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ముందుగా రాజ్‌దేశ్ పాండే కాషాయ ధ్వజారోహణం చేసి భక్తిశ్రద్ధలతో స్వదేశీ గోపూజ నిర్వహించారు. అఖండ జ్యోతి ప్రజ్వలన అనంతరం నీ గానమే నా ప్రాణం కార్యక్రమం ప్రారంభమైంది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏకధాటిగా అయ్యప్పస్వామి అఖండ నామ సంకీర్తన కొనసాగింది. గురుస్వాములు, శిష్య బృందాలు ఆలపించిన భజనలు, పాటలు భక్తుల్లో భక్తిపారవశ్యాన్ని నింపాయి. సాయంత్రం స్వామికి అభిషేకం, పడిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గురుస్వాములు అతిథులను సన్మానించారు. రాత్రి 8 గంటలకు హారతి, హరివరాసనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేశు వెంకటరెడ్డి, తదితరులు ఉపాల్గొన్నారు.

అరటి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించండి

వేముల : అరటి సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏఓ ఓబులేసు రైతులకు సూచించారు. మండలంలోని వేల్పుల, బెస్తవారిపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అరటి పంట సాగుపై రైతులకు మెళకువలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగిన మోతాదులో ఎరువుల వాడకంతోపాటు సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడంవల్ల దిగుబడులు పెరుగుతాయన్నారు. అలాగే పత్తి, ఉల్లి పంటలలో సస్యరక్షణ చర్యలు తక్కువ పెట్టుబడితో చేపట్టి నాణ్యమైన అధిక ఉత్పత్తులు సాధించాలన్నారు. ప్రధానంగా ఉల్లి పంటలో ఊదా రంగులో మచ్చలు ఏర్పడి ఎండిపోతే తెగుళ్ల నివారణకు క్లోరోథోర్లోనిల్ 2.5 గ్రాములు, కార్బడిజం 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు.

ముఖ్యంగా సూక్ష్మదాతు లోప నివారణకు జింక్ సల్ఫేట్ 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ శాఖ అందిస్తోందన్నారు. కావాల్సిన రైతులు చీనీ, వేరుశనగ పంటలకు వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, వీహెచ్‌ఏ ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.



వేముల : అరటి సాగులో సస్యరక్షణ చర్యలను రైతులకు వివరిస్తున్న ఏఓ

లింగాలలో..

లింగాల : పంటలకు ఆశించిన చీడ, పీడల నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. బుధవారం మండలంలోని దొండ్లవాగు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రమేష్ మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకంవల్ల ప్రకృతిని కాలుష్యం చేయడంతోపాటు అధిక ఖర్చు చేస్తూ నాణ్యతలేని పంట ఉత్పాదనలను సాగు చేస్తున్నారన్నారు. భావి తరాలకు మంచి నేల, మంచి ఆహారం అందించాలంటే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం రైతు చప్పిడి కొండారెడ్డి సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. అక్కడే ద్రవ జీవామృతాన్ని తయారు చేసి చూపించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది హరిత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



లింగాల : ద్రవ జీవామృత తయారీ విధానాన్ని చూపిస్తున్న ఏఓ, సిబ్బంది

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతులకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివమునెమ్మ అధ్యక్షతన వీడ్కోలు సమావేశంలో వివిధ ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కడ విధులు నిర్వహించిన గుర్తింపు తెచ్చుకునే విధంగా పనిచేయాలన్నారు. బదిలీపై వెళ్లిన ప్రతి ఒక్కరూ వారి వంతు సహాయ సహకారాల్లో అందించి పాఠశాల అభివృద్ధికి కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగినప్పుడే ఉపాధ్యాయుల నుంచి నాణ్యమైన విద్యను నేర్చుకోగలుగుతారన్నారు. క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరై మంచి విద్యతోపాటు భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

అనంతరం జ్ఞాపకాలు, అనుబంధాలను గురించి పాఠశాల సిబ్బందికి చక్కగా వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బోధ నేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా వృద్ధిచెందాలి

చింతకొమ్మదిన్నె : స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా వృద్ధి చెంది పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సూచించారు. స్థానిక మండల వెలుగు కార్యాలయ ప్రాంగణంలో బుధవారం స్వయం సహాయక సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలను ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సందర్భంగా మండలం ఆస్పిరెంట్ మండలంగా ఎంపిక అయినందున కేంద్ర ప్రభుత్వం ఒక్కో స్వయం సహాయక సంఘానికి పదివేలు రూపాయల చొప్పున 100 గ్రూపులకు పదిలక్షల రూపాయలు ఇస్తున్నట్లు, దీనిని సంఘంలోని వారు వడ్డీ లేకుండానే ఉచితంగా సంఘ అవసరాలకు ఉపయోగించుకోవాలన్నారు. అలాగే స్త్రీనిధి, బ్యాంకు రుణాలు కలిపి మొత్తం ఒక కోటి 65 లక్షల రూపాయలు మెగా చెక్కును డి.ఆర్.డి.ఏ. పి.డి. రాజ్యలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రాజు, సీసీలు, వీఓఏలు, సర్పంచ్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సమస్యలు ఏకరువు పెట్టిన మహిళలు

మండలంలోని బుసిరెడ్డిపల్లె దళితవాడ, పెద్దకాంపల్లె మహిళలు తమ గ్రామంలో వీధి లైట్లు, రోడ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. జమాలపల్లె దళితవాడ మహిళలు తమ గ్రామంలోని మురికి కాలువలు మూయక పోవడంతో అందులో పిల్లలు పడుతున్నారన్నారు. గుర్రంగుంపు తాండ మహిళలు తమకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ త్వరగా ఇప్పించాలని, అలాగే తమ ఆర్ అండ్ ఆర్ కాలనీలోని ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని కోరారు. కొందరు మహిళలు తమకు తల్లికి వందనం డబ్బులు పడలేదని, అర్హత కలిగి ఇప్పటికి డబ్బులు పడని అందరికి పడేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



స్వయం సహాయక సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ రుణాల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

పోలింగ్ బూత్‌ల పరిశీలన

లింగాల : మండలంలోని పోలింగ్ బూత్‌లను బుధవారం తహసీల్దార్ ఈశ్వరయ్య పరిశీలించారు. ఆఫ్ పోలింగ్, రేషనలైజేషన్ కింద లింగాల ఎస్సీ కాలనీ, లింగాల హైస్కూలులోని పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

కడప ఎడ్యుకేషన్: సీపీ బ్రౌన్ గ్రంథాలయానికి దూరదర్శన్ విశ్రాంత అదనపు డైరెక్టర్ డా.రేవూరి అనంతపద్మనాభరావు, విద్యుత్తు శాఖ విశ్రాంత ఎస్ఈ కోడూరు పుల్లారెడ్డి బుధవారం 500 పుస్తకాలు అందజేశారు. వారి నివాస గృహాలకు వెళ్లి గ్రంథాలయ సిబ్బంది జి.హరిభూషణరావు, సి.నీలకంఠేశ్వర్, బి.హరికృష్ణ ఆ పుస్తకాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ రివర్స్ ఆఫ్ ఇండియా, ఫెస్ట్‌స్క్రిప్ట్, పుట్టపర్తి రచనల్లో భారతీయ సంస్కృతి, శతజయంతి సాహితీ మూర్తులు, విలక్షణ పీవీ.కత్తి కాంతారావు, ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం2 తదితర పుస్తకాలు ఉన్నయన్నారు. దాతలను వైవీయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ అభినందించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరంలో డివిజన్ ఇన్‌చార్జిల నియామకానికి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గౌరవిస్తూ, రాజకీయాలపై ఆసక్తి కలిగిన వారు ఈ నెల 5వ తేదీ లోగా తమ దరఖాస్తులను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, ఇందిరాభవన్, జిల్లా కాంగ్రెస్ కార్యాలయం, 1/27-9, ఏపీహెచ్‌బీ కాలనీ, కడప చిరునామాకు పంపాలన్నారు. కొత్తవారికి అవకాశమివ్వాలనే ఉద్దేశంతో పార్టీ ఈ సంస్కరణలు చేపడుతోందని, తమ సమయం, శ్రమ, వనరులను అంకితం చేయదలచినవారు పార్టీకి మద్దతుగా ముందుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 8106112679 మొబైల్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

కక్షపూరిత రాజకీయం చేస్తున్న కూటమి ప్రభుత్వం

వేంపల్లె : కూటమి ప్రభుత్వం కక్ష పూరిత రాజకీయం చేయడం సరైంది కాదని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు రహంతుల్లాఖాన్ తెలిపారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవలం కక్షసాధింపు చర్యల్లో భాగంగానే వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి ఇంటిని కూల్చి వేయడం జరిగిందని, 8 ఏళ్లుగా నివాసముంటుంటే ఇప్పుడు చెరువు భూమి అంటూ కూల్చివేయడం దారుణమన్నారు. బడి, గుడి వద్దే మద్యం షాపులు ఉన్నాయని, వాటిని మాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని, కూటమి రెడ్ బుక్ రాజ్యాంగం రోజు రోజుకీ తారాస్థాయికి చేరుతోందని, రానున్న రోజుల్లో ప్రజలే వారికి తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు.

నీకేమీ తక్కువ కాను..

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక సీ ఎస్ఐ చర్చి సమీపంలో సెల్ టవర్‌కు తీగజాతి మొక్క నేను నీకేం తక్కువ కాదంటూ అల్లుకుపోతోంది. మొక్క దశలోనే ఈ తీగను తుంచివేసి ఉంటే నిలువెత్తుకు అల్లుకుపోయేది కాదు. నెలలపాటు అలాగే వదిలేయడంతో సెల్ టవర్‌కు పూర్తి అల్లుకుంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి టవర్‌కు తీగజాతి మొక్క అల్లుకోకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



విద్యార్థులకు నగదు బహుమతి

ముద్దనూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 2024-25 సంవత్సరంలో పదవ తరగతిలో ప్రతిభ కనబరచిన 10 మంది విద్యార్థులకు నగదు బహుమతిని బుధవారం పంపిణీ చేశారు. శ్రీగజ్జల చెన్నారెడ్డి, అచ్చమ్మల జ్ఞాపకార్థ వారి అస్ట్రేలియా దేశంలో స్థిరపడిన గజ్జల ప్రభాకర్‌రెడ్డి రూ.10 లక్షలు ఉన్నతపాఠశాలలో డిపాజిట్ చేశారు. ప్రతి ఏడాది ఈ సొమ్ముపై వచ్చే వడ్డీ రూ.1లక్షను విద్యార్థులకు అందజేయనున్నామన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి 10 మంది విద్యార్థులకు మెమెంటో, నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల పదవీ విరమణచేసిన ఉపాధ్యాయులు రాజబాబు, మాబులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మెమెంటోలతో ప్రతిభ కనబరచిన విద్యార్థులు, మాజీ ఎంపీపీ, ఉపాధ్యాయులు

కడప, ప్రొద్దుటూరు ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ఎస్‌జీటీ బదిలీల మ్యాన్యువల్ కౌన్సిలింగ్‌లో ప్రిఫరెన్షియల్ కేటగిరిలో ఇవ్వాల్సిన స్థానాలకంటే అధికంగా కేటాయించిన కడప, పొద్దుటూరు ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు కోరారు. డీఈవో షేక్ శంషుద్దీన్ కడపలోని ఆయన కార్యాలయంలో బుధవారం కలిసి ధర్నా నోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ పదోతరగతి మూల్యాంకనం చేసిన వారికి పారితోషకం చెల్లించడంతో నిర్లక్ష్యం చేస్తున్నారని, సమస్యలు పరిష్కరించకపోతే జులై 9న కడప డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కడప, ప్రొద్దుటూరు ఎంఈఓల తీరుతో ఉపాధ్యాయులకు తీరని నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం రూపొందించిన బదిలీల చట్టం-2025 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరీకి 40 శాతానికి మించి పోస్టులు కేటాయించకూడదనే నిబంధన ఉన్నా.. ఇష్టారాజ్యంగా పోస్టులు కేటాయించారన్నారు. పది మంది జనరల్ కేటగిరీ ఉపాధ్యాయులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బదిలీల కౌన్సిలింగ్ పూర్తయి 20 రోజులైనా ఇంతవరకూ ఎంఈఓలపై చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. పది పరీక్షల మూల్యాంకనం పూర్తయి మూడు మాసాలు కావస్తున్నా పారితోషికం చెల్లించకపోవడం తగదన్నారు.



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోర్టు ఉత్తర్వులున్నా.. వక్ఫ్ ఆస్తుల కబ్జా

కడప సెవెన్‌రోడ్స్: న్యాయ స్థానాల ఉత్తర్వులు ఉన్నప్పటికీ వక్ఫ్ ఆస్తులను కబ్జా చేసిన వారిపై కేసులు నమోదుచేయాలని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా, మైనార్టీ రైట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు దస్తగిరి కోరారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ వసీంను బుధవారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. కడప నగరంలో చాలాచోట్ల వక్ఫ్ ఆస్తులు ఆక్రమించి విలాసవంత భవనాలు నిర్మించుకుంటున్నారన్నారు. బిల్టప్ సర్కిల్ వద్ద వక్ఫ్ స్థలాన్ని ఆక్రమించి గదులు నిర్మించుకుంటున్నారని, అక్కడ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పాత బస్టాండు పెట్రోలు బంకు ఎదురుగా గతంలో ప్రజా వైద్యశాల స్థలాన్ని ఆక్రమించి పెద్ద భవనం నిర్మిస్తున్నారని, రోషన్ మున్వర్ మసీదు వద్ద రాత్రికి రాత్రే షెడ్డు నిర్మించారన్నారు.



వక్ఫ్ ఇన్‌స్పెక్టర్‌కు విన్నవిస్తున్న మగ్బూల్‌బాషా

వేతనాలు పెంచాలని కార్మికుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం అర్ధ నగ్నంగా బిక్షాటన చేశారు. కడప కోటి రెడ్డి సర్కిల్ నుంచి కార్పొరేషన్ వరకు సాగిన ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి గోపి మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, తల్లికి వందనం పథకం వర్తింపజేయకపోవడం అన్యాయమన్నారు. రూ.25000 లోపు వేతనం తీసుకునేవారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని, జీవో నెంబర్ 36 ప్రకారం రూ.24500 రూపాయల వేతనం ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ల కింద రూ.75000, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, ఈ నెల 4న విజయవాడ ధర్నాచౌక్ వద్ద ఆందోళన నిర్వహించనున్నామని తెలిపారు. చంద్రారెడ్డి, బ్రహ్మనంద రెడ్డి, సుంకరరవి, ఇత్తడిప్రకాష్, ఓ.సుబ్బారాయుడు, గురవయ్య, వెంకటేష్, గోవర్ధన్, రాంమోహన్‌రెడ్డి, చిన్నఓబులయ్య పాల్గొన్నారు.

